
ఓం నమోభగవతే శ్రీరమణాయ




# రమణ భాస్కర




సంపుటి : 7 సంచిక : 16 పుష్పం : 43-45 05-05-2002

**RAMANA BHASKARA**
**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**
PAGES : 16
**VOL : 7 ISSUE : 16**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278




## గురువులేని విద్య - గుడ్డి విద్య

ఆత్మను దర్శించినవాడే గురు శబ్దానికి అర్హుడు. తన స్వరూపాన్ని తెలియజెప్పే విద్యే నిజమైన విద్య, దానివల్లనే శాశ్వత శాంతి, సుఖం లభిస్తాయి, సమస్థితి వస్తుంది. గురువు యొక్క నోటిని ఈశ్వరుడు జిజ్ఞాసువుల కొరకు వాడుకొంటాడు. జ్ఞానమంటే అజ్ఞానాన్ని తగలబెట్టటం. గురువు తన భోధ ద్వారా, మౌనం ద్వారా, సాధకుని మనస్సును అంతర్ముఖం అయ్యేటట్లు చేస్తారు. వస్తువులను దైవనేత్రాలతో సందర్శించటమే, నిజమైన విద్య. కళాశాలల్లో బోధించేది విద్యకాదు, అసలు విద్యకు అది ఒక సాధనం మాత్రమే. "ఆధ్యాత్మిక విద్య, పుస్తకాలు పఠిస్తేరాదు గురుముఖతా రావాలి" అని గాంధీజీ అన్నారు. శాస్త్రాలను అవగాహన చేసుకోవటానికి గురువు అనే మార్గబంధువు అవసరం. జ్ఞాన దీపాన్ని జ్ఞాని మాత్రమే వెలిగించగలడు. ఆధ్యాత్మిక విద్యతో సంబంధం లేని జాతికి సమగ్రత చేకూరదు. మైనా(పక్షి) కి మన మాటలు నేర్పాలి అంటే దానికి ఎదురుగా పెద్ద అద్దం పెట్టి దాని వెనుక ఒకరు మాట్లాడితే ఆ పక్షి అనుకొంటుంది "మన మాదిరి పక్షి మాట్లాడుతున్నది!" అని భావించి మాటలు నేర్చుకొంటుంది, అలాగే రూపంలేని పరమాత్మ మానవాకారంతో గురురూపంలో ఆత్మవిద్యను తెలుపకపోతే, మానవుడు తన స్వరూపాన్ని ఎలా గ్రహించగలడు? తత్వజ్ఞానం సద్గురువు హృదయంనుండి సాధకుని హృదయంలోకి ప్రవేశిస్తుంది. వారు మన హృదయంలో నాటిన భక్తిబీజాన్ని మొలకెత్తకుండా ఏశక్తి ఈ సృష్టిలో చెయ్యలేదు. ప్రేమ పూరితమైన గురువు లభించిన తరువాత, గురువే సాధన, గురువే సాధ్యం అంటారు పెద్దలు. అపారమైన కరుణతో శిష్యుని యొక్క స్థాయికి దిగివచ్చి బోధించటం గురువుకే సాధ్యం. సాక్షాత్కార అనుభూతిలేని రచనలు అధ్యాయనం చెయ్యటం వల్ల ప్రయోజనం అంతంత మాత్రమే "స్వానుభూతి లేక శాస్త్రవాసనలచే సంశయంబు విడువదు సాధకునకు చిత్రదీపమునను (ఫోటోలో ఉన్న దీపంవల్ల) చీకటి పోనట్లు" అన్నారు వేమన. సద్గురువును ఆశ్రయించిన సాధకుడు ఎంత మందమతియైనా వాడికి గురువు జ్ఞానాన్ని ఇయ్యగలడు. తోటకాచారి విషయంలో శంకరాచార్యులవారు కొన్ని సెకనుల కాలంలోనే అద్భుతమైన శ్లోకాలను వల్లించే స్థితికి తీసుకొని వచ్చారు - గురువు యొక్క వైభవం అది. ఆ అనుగ్రహ స్వరూపం త్రికాలాల్లోను ఉంది. ఆ అర్హులే గురు సన్నిధికి చేరుతారు. అందుకే యోగవాసిష్ఠము యిలా అంటున్నది :

**శాస్త్రస్యాస్యతుయన్నామ వాద సంతద్వినాపరః॥**
**అభ్యాసోద్భుశ్యసం శాస్త్రీ నభూతో నభవిష్యతి॥** అని.

గురువు లభించనంతకాలం సాధకుడు గమ్యాన్ని చేరే మార్గం అంధకారంతో కూడిన కీకారణ్యం లాంటిది. అదే సద్గురువు లభిస్తే ఆ మార్గం పుష్పక విమానంలో పయనించటం లాంటిది.

**సాగిరాజు రామకృష్ణంరాజు**
అర్ధవరం

ఈ సంచికలో...... సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు


27-03-2002 చించినాడ ........ 3
11-04-2002 సామర్లకోట ........ 8
27-04-2002 కోడవల్లి ........ 12



Visit us @ www.srinannagaru.com

# రమణభాస్కర

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-03-2002, చించినాడు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

డబ్బును నిలబెట్టుకోవటంకంటే జీవితంలో మంచితనమును కాపాడుకోవటం చాలాకష్టం. చివరిశ్వాసవరకు మంచితనంగా ఉండటం చాలాకష్టం. ఇవాళ మంచిగా ఉన్నాము రేపు ఎలా ఉంటామో చెప్పలేము. శ్రీ కృష్ణ చైతన్య ఏమి చెప్పారు అంటే నీ మనస్సులో ఉన్న మంచితనాన్ని కాపాడుకోవటానికి ఎవరు అడ్డువస్తున్నారో వారిని మర్యాదగా వదిలించుకో అని చెప్పారు. నీకు స్నేహితులు ముఖ్యంకాదు మంచితనంముఖ్యం. నీ మంచితనమే నిన్ను భక్తుడిగా చేస్తుంది, భగవంతుని పాదాలదగ్గరకు చేరుస్తుంది, నీకు ఆత్మజ్ఞానమును కలుగజేస్తుంది. సముద్రంలో ఎక్కడ చూసినా నీరేకాని త్రాగటానికి ఒక్కచుక్క కూడా పనికిరాదు. కొంతమంది ధనవంతులు ఈ సృష్టిలో అలాగే ఉంటారు సముద్రంలో నీరు త్రాగటానికి ఎలా ఉపయోగపడదో వారిధనం కూడా అంతే, ఎవరికీ ఉపయోగపడదు. నిజమైన భక్తుడు దేనికోసం ఎదురుచూడడు, వచ్చిన దానితో తృప్తి పడతాడు. అంతా భగవంతుడే, నేనులేను అనుకొంటాడు అది భక్తుడి లక్షణం. మనం ఏమి అనుకొంటాము అంటే మనలో ఏదో గొప్పతనం ఉంది అనుకొంటాము. అది అహంకారలక్షణం, మనలో ఉన్న ప్రాపంచిక జ్వరానికి ఉన్న లక్షణం. మనలో ఏమీ లేదు అన్న సంగతి భగవంతుడు అనుభవంలోనికి వచ్చాక మనకు తెలుస్తుంది అంతవరకు మనలో ఏదో గొప్పతనం ఉంది అని లోపల అనుకొంటూ ఉంటాము కానిపైకి మర్యాదగానటిస్తాము. ఇప్పుడు మనపరిస్థితి ఎలా ఉంది అంటే చావు వచ్చేస్తోంది కాని చావు అంటే ఎవరికీ ఇష్టంలేదు. కాని చావటంతప్పటంలేదు. బ్రతకటం సుఖంగా బ్రతుకుతున్నామా అంటే అదీ లేదు. మనకు బ్రతకటం ఇష్టంలేదు, చావటం ఇష్టంలేదు ఎటూకాకుండా తయారయ్యాము. కొంతమంది పనిఎలా తప్పించుకొందామాఅని చూస్తారు. భగవంతుడు మనకు ఇచ్చినపనిని శ్రద్ధగా చేయము. చావును ఇష్టంగా ఆహ్వానిస్తామా అంటే అదీలేదు. ఎక్కడికి పారిపోతాము. మనంచేస్తున్నపని ద్వారా తరించవచ్చు. కర్మచేస్తూకర్మను అతక్రమించాలి. కర్మ చేస్తూకర్మబంధంలోనుండి విడుదలపొందాలి. అంతేగాని కర్మమానివేసినంత మాత్రంచేత జ్ఞానంరాదు. కొంతమంది ఎలా ఉంటారు అంటేవారు చేసేపనిని వదిలివేయటం, ఇతరులు





చేసేపని బాగుంది అని దానికోసం చూస్తారు. ఒకడు టీచర్ ఉద్యోగం చేస్తూ ఎవరోఇతరులు వ్యాపారంలో కోట్లు సంపాదించారు నేను ఇలా ఉన్నాను అంటాడు. ఇటువంటి గొడవలు వద్దుఅని పరమాత్మచెపుతున్నాడు. వీడు వ్యాపారంచేస్తే ఉన్నది అంతా పోవచ్చు అదివాడికి తెలియటంలేదు, ఒకవిధంగాదేవుడు వాడికి మేలుచేసాడు అదివాడు గ్రహించటంలేదు. మనంపనిదొంగలం కాకూడదు. పనిచేస్తూ జ్ఞానం సంపాదించాలి. నిజమైనభక్తుడి లక్షణం ఏమిటి అంటే పనిలోనుండి, చావులో నుండి తప్పించుకోవాలని చూడడు. ఏది వచ్చిన అది భగవంతుని ప్రసాదమే అంటాడు. మన ప్రారబ్ధమును బట్టి ఒకోసారి దారిద్ర్యం వెంటాడుతుంది, ఒకోసారి ఐశ్వర్యం వెంటాడుతుంది. అయితే పరిస్థితులు ఎలా ఉన్నా భక్తుడు సమానంగానే ఉంటాడు. మనంజీవితంలో ఎన్నోపాఠాలు నేర్చుకోవలసిఉంది. మనం కాలేజీలో నేర్చుకొనేపాఠాలు కన్నా జీవితానుభవంనేర్పేపాఠాలు ఎక్కువ. ప్రపంచసంబంధాలు ఏమీ నిజంకాదు. స్నేహాలు నిజంకాదు, విరోధాలు నిజంకాదు. ఇంట్లో భార్యాభర్తల సంబంధం, తల్లీపిల్లలసంబంధం, అన్నాచెల్లెలు సంబంధం ఒక్కటి కూడా నిజంకాదు. శరీరం ఉన్నంతవరకే ఈ సంబంధాలు. అయితే సంబంధంలేదుకదాఅని డ్యూటీ చేయటం మానకూడదు అదీ భగవంతుడు చెప్పేది. అత్తగారు మంచిదా, చెడ్డదా అది నీకు అనవసరం. నిన్ను ఆకుటుంబంలో పడవేసాడుకాబట్టి నీడ్యూటీ నీవు చెయ్యి. ఆకుటుంబంలో పెద్దలకు నీవు చేయవలసినది చేయకపోతే వారికి ఋణపడిఉంటాము. ఈ ప్రాపంచిక సంబంధాలు నిజంకాకపోయినా మనడ్యూటీ మనం చేస్తూ ఈ ఋణంలోనుండి విడుదలపొందవచ్చును. కర్మచక్రంలోనుండి విడుదల పొందటానికి మనంచేస్తున్న పనికూడా మనకు సహకరిస్తుంది. అయితే మనంచేసేపని ఇష్టంగాచేయాలి, కర్మఫలం నిన్ను అంటకుండా చేయాలి. భగవంతుడిపట్ల నీకు నిజమైన భక్తికలిగినప్పుడు పితృఋణం, ఏఋణం మిమ్మల్ని ఏమీచేయలేదు, కాని నీకు పరాభక్తి కలగకపోతే ఈ ఋణాలు వచ్చి నీ పీకచుట్టుకొంటాయి అది మర్చిపోవద్దు.

కొంతమందికి తినటానికి తిండిలేకపోయినా చాలా ప్రశాంతంగా ఉంటారు. అదొకవైభవం. అదివారు జన్మాంతరంలో ఎంతకృషిచేస్తేవచ్చిందో. ఆముఖంలో ఎంతోప్రశాంతత ఉంటుంది. కొంతమందికి ఎంతసంపదఉన్నా ఎప్పడూ దు:ఖపడుతూఉంటారు. సంపద అనేది బయటలేదు, నిజమైన సంపద నీలోపలే ఉంది. నీ మనస్సులో సంపద లేనప్పడు బయట ఎంతున్నా సముద్రంలో ఉన్న నీరుతో సమానము. మనకు ఇంటినిండా బియ్యంఉన్నా,

పొరుగువారు ఆకలితో బాధపడుతూఉంటే కొద్దిగా బియ్యం ఇవ్వలేము ఇంకమనకు జ్ఞానం ఎలా కలుగుతుంది. నీకు తోటిమానవులపట్ల సోదరభావంలేదు, నీ హృదయంలో దయ, కరుణలేదు ఇంక నీకు జ్ఞానం ఏమిటి? కొంతమంది అత్తగారు తిడుతున్నా ప్రశాంతంగా ఉంటారు. ఏమిటి మీఅత్తగారు తిడుతున్నారు అంటే ఎందుకు అత్తగారిని అనుకోవటం అది నా దేహప్రారబ్దం అనుకొంటే పోతుంది అంటారు, అంతమంచివారు ఉన్నారు. ఏదోమాటలు చెప్పటంవలన జ్ఞానం వస్తుందిఅనుకోవద్దు. జీవితంలో ఎన్నోపాఠాలు నేర్చుకోవాలి. భక్తుడిని మనంతిట్టినా నిర్మలంగానే ఉంటాడు ఎందుచేతనంటే వాడి మనస్స భగవంతుని పాదాలదగ్గరఉంటుంది. వాడుతిట్టాడు, వీడు కొట్టాడు అనే గొడవలు వాడికి ఏమీ ఉండవు. సర్వజీవకోటిపట్ల సమానబుద్ధి కలిగిఉండు. సమానబుద్ధి కలిగిఉంటే నాపట్ల ఉత్తమభక్తికలుగుతుంది, కారణరహితమైన భక్తి కలుగుతుంది అని భగవంతుడు చెపుతున్నాడు. నాకు సమాధిస్థితి ఎప్పడు కలుగుతుంది, నాకు జ్ఞానం ఎప్పడు వస్తుంది అనుకొనేవాడు భక్తుడుకాదు. నిజమైనభక్తి కలిగినప్పడు మోక్షంఎప్పడు వస్తుంది అని ఆవైపుకు నీమొఖం తిరగనేతిరగదు. అది భక్తియొక్కలక్షణం. నీస్వరూపమును విడిచిపెట్టి చాలాదూరం వచ్చేసావు. ఇంక తిరుగుముఖం పట్టవా? తిరుగుముఖం పట్టకపోతే నీ యింటికి ఎలా వెళ్తావు. ఎక్కడైతే శాంతి ఉందో, ఎక్కడ అయితే చావులేని వస్తువు ఉందో ఆస్థానమును వదిలి చాలాదూరం వచ్చేసావు. ఎప్పడు పతనమయ్యావో ఇంతదూరంవచ్చేసావు. ఇంక తిరుగుమొఖంపట్టవా? ప్రభువునీలోపలే ఉన్నాడు. నీమనస్సును లోపలకు తిప్పవా?

ఈశ్వరునిపట్ల ప్రేమలేకుండా, నువ్వు చేసే పూజలు, జపాలు, ధ్యానాలు ఎందుకు? ఇలా ఎవరిని మోసంచేస్తావు? ఈశ్వరునిపట్ల ప్రేమలేకుండా ఆయనపాదాలను ఎలాచేరుకోగలవు. ఎవరిని పొందటానికి నీవు ధ్యానంచేస్తున్నావో ఆయనమీద ప్రేమలేకుండా ఆయనను ఎలా పొందుతావు. నీకు ఎప్పడూ లోకంగొడవేనా? లోకంలోనికి వచ్చినపని మర్చిపోయావు. ఇంక నీకు ఎప్పడు లోచూపు కలుగుతుంది? మాకు వైరాగ్యం ఎప్పడు కలుగుతుంది, ఎప్పడు జ్ఞానం వస్తుంది? అని కొంతమంది అడుగుతారు. శ్రీకృష్ణ చైతన్య ఏమిచెప్పారు అంటే నీవు నిలబడిఉన్నా, కూర్చొనిఉన్నా ఎటుచూసినా భగవంతుని మధ్యలో ఉన్నవాడికి ఇంకవైరాగ్యంఏమిటి? ఆయనకంటే భిన్నంగా ఏదైనా కనబడుతూఉంటే అప్పడు వైరాగ్యం. అంతటా ఆయనే కనబడుతూఉంటే ఇంక వాడికి వైరాగ్యంఏమిటి? నీటిలో ఉన్న





చేప దాహం వేస్తోంది అనుకోవటం ఎటువంటిదో భక్తుడు జ్ఞానం కావాలి అనుకోవటం అటువంటిదే. పరాభక్తుడికి ఇంక జ్ఞానం ఏమిటి? వాడు జ్ఞానంలోనే ఉంటాడు. కొంతమంది ఇంకమాకు జన్మలు వద్దు అంటారు. ఇస్తే ఇస్తాడు లేకపోతే లేదు, ఈ లెక్కలు ఏమిటి? ఇదిభక్తా? నిజమైన భక్తుడికి అసలు మోక్షంగొడవే ఉండదు, అది పరాభక్తి. మనం చేసేది పాడు స్నేహాలు, మనకు భగవంతుడు దొరకాలి అంటే ఎలా దొరుకుతాడు. నిజమైన భక్తులతో సహవాసంచేస్తే భగవంతుడు దొరుకుతాడు. నీవు పొందవలసింది అంటూ ఏదీలేదు, నీవు పోగొట్టుకోవలసిందేఉంది. భగవంతుడునీలోపలే ఉన్నాడు. ఆయనను నీవు కనిపెట్టనక్కరలేదు. నీకు తెలిసినాఉన్నాడు, నీకు తెలియకపోయినా ఆయన నీలోపలే ఉన్నాడు. నీఅనుచితభావాలు, అక్కరలేనితలంపులు, పనికిమాలిన సంస్కారములు, నువ్వుకానివాటిని అన్నింటిని వదులుకొంటూవెళ్ళాలి. అప్పడు ఉన్నవస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. చితి మరణించిన శరీరాన్ని కాలుస్తుంది కాని వ్యర్థమైన చింతలు జీవించి ఉన్నశరీరాన్ని కాల్చేస్తాయి. అందువలన వ్యర్థమైనచింతలను, కోరికలనువదిలిపెట్టు. పూర్వజన్మసంస్కారమునుబట్టి నీకు పనికిరాని సంస్కారములు వస్తాయి వాటిని పెంచుకోకుండా అక్కడఆగి ఇప్పడు మంచిపనులు చేస్తూ మంచి సంస్కారములతో పనికిరాని సంస్కారములను తొలగించుకో. ఇలా ప్రయత్నం చేస్తూఉంటే భగవంతుని అనుగ్రహం వస్తుంది. అనుగ్రహంసహాయంతో ఈశ్వరుడిని పొందవచ్చు. భగవదనుభవంపొందాలంటే నీకు ఇష్టంఉన్నా లేకపోయినా పనికిరాని సంస్కారములను వేరుతో సహావిడిచిపెట్టాలి, వాటిని పరిత్యజించాలి. కృష్ణభక్తులు ఏమి చెపుతారు అంటే ఈ తలంపుల గొడవమాకు ఎందుకు? మేము కృష్ణుడి పాదాలను ఆశ్రయిస్తాము. తలంపులు లేకపోతే ఏగొడవ లేదు, తలంపులుఉంటే మాకు తెలియకుండా అవేపోతాయి అని చెపుతారు. మాకు ఏది మంచిదో మా కంటే ఆయనకే బాగాతెలుసు. ఏవి అడ్డంగా ఉన్నాయో అవి ఆయనే తొలగిస్తాడు. ఇవి అడ్డంగా ఉన్నాయి అని ఆయనకు తెలియదా? తొలగించమని ఆయనను అడిగే అంత పెద్దవాళ్ళం అవ్వలేదు. తొలగిస్తే ఆయనే తొలగిస్తాడు లేదా ఇంకా కొన్ని అడ్డంకులు పెడతాడు. అది ఆయన ఇష్టం. అడ్డంకులు తొలగించమని మేము అడగము, ఆయన పాదాలను విడిచిపెట్టము. జ్ఞానం ఇవ్వమని మేము అడగము, ఆయనే ఇవ్వాలి. భక్తి మమ్మల్ని అడగనివ్వదు, అడిగితే మా కృష్ణుడిని అగౌరవపరచినట్లే, అది మా భక్తికి భంగం అంటారు. మనోనిగ్రహం కలుగజేయమని మేము

ఆయనను అడగము, ఆయనపట్ల మాకు ఉన్నభక్తే మనోనిగ్రహాన్ని తీసుకొనివస్తుంది గానిమేము అడగం అంటున్నారు కృష్ణభక్తులు. మా మనస్సును ఆయనకే ఇచ్చేస్తే ఇంక నిగ్రహించుకోవటానికి మనస్సు ఎక్కడుంది? శరీరం మరణించటం, మరల తిరిగిపుట్టటం ఇదే సంసారం. కృష్ణభక్తులు ఏమి అంటారు అంటే మాకు ఆయన పాదాల యందు భక్తిముఖ్యం కాని ఈసంసారంలో నుండి విడుదల చేయమని ఆయనను అడగము. ఈశరరం జీవించి ఉందా లేక మరణించిందా అనే గొడవ మాకు వద్దు, ఆయన పాదాలే మాకు గతి. బంధంలో ఉంచినా, బంధంలో నుండి విడుదల చేసినా అది ఆయన ఇష్టం అంటారు. అది పరాభక్తి. ఇంక మన పని ఎలా ఉంది అంటే దేవుని దగ్గర రెండు పుష్పాలు పెట్టటం, గుడిచుట్టూ తిరగటం ఏదో ఒకటి అడగటం. ఇది మన భక్తి. ఇది వ్యాపారభక్తి. మనస్సే మనకు నేనుగా వ్యక్తమవుతోంది. ఆనేను ఎవరు? అని దాన్ని ప్రశ్నిస్తూ ఉంటే లోపలకు ఉపసంహరింపబడి దానిమూలంలోనికి వెళ్ళి అది నశిస్తుంది. అది విచారణమార్గం. నిరంతరం భగవంతుని స్మరించినా మూలతలంపు నశిస్తుంది. ఇది భక్తి మార్గం. మీపూర్వజన్మ సంస్కారమునుబట్టి మీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణించి అజ్ఞానంలో నుండి విడుదల పొంది తరించండి. మరణం ఇప్పుడు మనం రమ్మంటే రాదు. మరణం వచ్చేవరకు జీవితంలోనుండి పారిపోవద్దు. ఒకవేళ మరణం వస్తే మరణంలో నుండి పారిపోవద్దు. పారిపోవటం భక్తుడి లక్షణం కాదు. ఏది వచ్చినా ఈశ్వరప్రసాదం అనుకోండి. జీవించినప్పుడు సరళంగా జీవించండి. చావును కూడా ప్రశాంతంగా స్వీకరించండి. మనకు పని అంటే ఇష్టంలేదు, చావు అంటే ఇష్టం లేదు. అందుచేత ఎంత సాధన చేసినా జ్ఞానం అనుభవంలోనికి రావటంలేదు. జీవితంలో మనకు అనుకూల పరిస్థితులు రావచ్చు, ప్రతికూలపరిస్థితులు రావచ్చు. అవిస్థిరంగా ఉండవు, అవి నిజంకాదు. అవి అన్నీ ప్రకృతికి సంబంధించిన విషయాలు. వీటి గొడవ వదిలేసి ఈశ్వరుని పాదాలను ఆశ్రయించి ఉండండి. కృష్ణభక్తులు ఏమిచెపుతారు అంటే పరిస్థితులు ఎలా ఉంటే మాకు ఎందుకు? మాబుద్ధి గోడలో మేకులా కృష్ణుడి పాదాలయందు స్థిరపడిపోయింది అంటారు. విషయచింతన ఉన్నప్పుడు అందులోనుండి ఎలా బయటకు రావాలి అనే గొడవ ఉంటుంది. పరమాత్మ చింతన తప్పించి అన్యచింతన లేనప్పుడు ఇంక విడుదల పొందటం ఏమి ఉంటుంది. పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మేము కృష్ణుడిలోనే ఉంటాము అని చెపుతారు.





## రమణభాస్కర

### (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-04-2002, సామర్లకోట)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆధ్యాత్మిక పురోగతికి, నైతిక నిష్టకు శారీరక ఆరోగ్యం, మానసికఆరోగ్యం పోషించుకొంటూ రావాలి. పునర్జన్మలేని స్థితిని పొందటానికి శారీరకఆరోగ్యం, మానసిక ఆరోగ్యం సహకరిస్తాయి. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం వలన, ఆయనకు శరణాగతి చేయటం వలన శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం బాగుపడతాయి. జీవితంలో వచ్చే సమస్యల గురించి ఆలోచించి మానసిక ఆరోగ్యమును పాడుచేసుకోవద్దు. జీవితంలో వచ్చే కొన్ని సమస్యలను మనం పరిష్కరించుకోగలము, కొన్ని సమస్యలను కాలమే పరిష్కరిస్తుంది. అప్పటివరకు సహనం, ప్రేమ అవసరం. బుద్ధుడు చెప్పిన మాటలను మనంకూడా చెప్పవచ్చు మనం చెప్పిన మాటలకు విలువ ఉండదు. కాని ఆ మాటలు చెప్పేటప్పుడు బుద్దుని హృదయంలో ఎటువంటి ప్రేమఉందో అటువంటి ప్రేమ మనకూ ఉంటే ఆ మాటలకు బరువు వస్తుంది, ఆమాటల ప్రభావం ఇతరుల మీద పనిచేస్తుంది. గీతలో భగవంతుడు చెప్పిన మాటలను మనం ప్రమాణంగా తీసుకొని, మాటమాటకు ఉద్రేకానికి గురికాకుండా దైనందిన జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి. ప్రతీ చిన్న విషయానికి ఉద్రేకపడితే జీవితంలో చాలా నష్టపోతాము. భక్తి పేరుమీద ఇంటి దగ్గర బాధ్యతలు విడిచిపెట్టకూడదు. బాధ్యతలు విడిచిపెడితే సోమరితనం వస్తుంది గాని జ్ఞానం రాదు. కుటుంబంలోగాని, సమాజంలోగాని మనం నిర్వర్తించవలసిన బాధ్యతను మనం నిర్వర్తించాలి. భక్తిపేరు మీద మనకు వచ్చే సమస్యల నుండి పారిపోవటానికి ప్రయత్నం చేయవద్దు. మనం మంచి మాట్లాడుతూ ఉన్నా, మంచిపనులు చేస్తూ ఉన్నా ఎవరో ఒకరు విమర్శిస్తూనే ఉంటారు. వారు విమర్శిస్తున్నారు అని మంచి పనులు చేయటం మానకూడదు. వారు విమర్శిస్తున్నారు అని మంచి పనులుచేయటం మానివేస్తే మాయ అనే వలలో పడిపోతారు. మాయ అనే వలలో పడతారా, లేదా అని చూడటం కోసం భగవంతుడు వారిచేత విమర్శింపచేస్తాడు, మీమానసిక బలం ఎంత ఉందో చూడటం కోసం భగవంతుడు అలాచేస్తాడు. అందుచేత మంచిని విడిచిపెట్టకూడదు. ఇతరులలో ఏమి చెడు ఉంది అని అన్వేషించటం వలన నీకు ఏమీ ప్రయోజనంలేదు, దానివలన కాలం, శక్తి వృధా అవుతాయి. మనలోఉన్న చెడును తొలగించుకొంటూ, మనకు మంచి ఆలోచనలు వచ్చేలా చూసుకొంటూ, మనలో పవిత్రత పెంచుకొంటూ రావాలి. పరమపవిత్రుడికి మాత్రమే ఆత్మజ్ఞానం కలుగుతుంది. పూర్వజన్మలో ఉన్న రాగద్వేషములు ఈజన్మలో ప్రారబ్దం క్రింద వస్తాయి. అందుచేత ఈశరీరం ఉండగానే

రాగద్వేషముల వేగం తగ్గించుకోవాలి. రాగద్వేషములు లేని మనస్సే ఆత్మాకారం చెందుతుంది.

సత్యం నీలోపలే ఉంది. దానికి పుట్టుకలేదు, దానికి మరణం లేదు. అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పడు చావు, పుట్టుకలు నీకు సమానంగా కనిపిస్తాయి. అప్పడు ఈశరీరం ఉన్నా, శరీరం లేకపోయినా ఒక్కటే. ఆస్థితిని ఈశరీరం ఉండగానే అనుభవంలోనికి తెచ్చుకో. దీనికి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం అవసరం. దీనికి కేవలం మన తెలివి, మన సాధన సరిపోదు, ఈశ్వరానుగ్రహం ఉంటేనే మనస్సు స్వాధీనంలోనికి వస్తుంది. మనం మంచి మాట్లాడాలి, ఇతరులకు చేయగలిగినంత మంచి చేయాలి, మనస్సులో సద్భావాలు కలిగిఉండాలి. మనకు నైతిక విలువలు లేకుండా, స్వార్థం తగ్గించుకోకుండా ఏదో ప్రాణామాయం చేసాము, ధ్యానం చేసాము అంటే మనస్సు హృదయ గుహలో పడదు. స్వార్థం తగ్గించుకొంటూ, గుర్తింపులు కోరకుండా మనం పనిచేయాలి. గుర్తింపులు కోరితే దేహాభిమానం పెరుగుతుంది. అవసరానికి మించిన ఆస్థులు పెంచుకొంటూ వెళితే ఆధనం కూడా పాపం చేయిస్తుంది, మన వెనకాల వారికి సోమరితనం నేర్పుతుంది.

దేహము నేను అని అనదు. మనస్సే నేను అనిచెపుతోంది. ఈ నేను అనే తలంపు వచ్చాక నాది వస్తోంది. నేను అనే తలంపు నీలోపల ఎక్కడనుండి ఉదయించి వస్తోందో అక్కడే నీ కంట్రోలర్ ఉన్నాడు. ఈ నేను అనే మూలతలంపు యొక్క మూలంలోనికి ప్రాణామాయం చేయటం వలననే వెళ్ళలేవు, దానికి వైరాగ్యం ఉండాలి. మనకు ఉండవలసినంత వైరాగ్యం లేదు, భక్తి లేదు. అందువలన అభివృద్ధిలోనికి రాలేక పోతున్నాము. నీకు ఏకాగ్రత లేకుండా, పవిత్రత లేకుండా, వైరాగ్యం లేకుండా ఇవి అన్నీ ఉన్నాయి అని నిన్ను నీవు మోసంచేసుకోవద్దు. ప్రయత్నం చేసివాటిని సంపాదించుకో. అనారోగ్యంతో బాధపడుతూ ఆరోగ్యంగా ఉన్నాను అనుకుంటే నీకే ప్రమాదం. సన్మానించినా, విమర్శించినా పొంగిపోయేది బాధపడేది మిథ్యా నేనే. ఇది అర్థం చేసుకో. మాయ అంతా మిథ్యా నేనులోనే ఉంది.అది నువ్వుకాదు. ప్రయత్నంచేసి దానిలో నుండి విడుదల పొందితే ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది.

సత్యాన్వేషణకు బుద్ధుడిలాగ బయటకు పొమ్మంటారా, గృహపరిత్యాగం చేయమంటారా అని అడుగుతున్నాడు. కర్మతో కూడిన జీవితాన్ని మనం సన్యసించనక్కరలేదు. పనిలో నుండి పారిపోవటానికి ప్రయత్నం చేయవద్దు. భగవంతుడు ఏ పనిఅయితే ఇచ్చాడో దానిని కూల్‌గా చేయటానికి ప్రయత్నించు. పనిదొంగలుకావద్దు. అహంభావన లేకుండా ఏపనిచేసినా అది నిన్ను బంధించదు. కర్తృత్వం లేకుండా, ఫలంపట్ల ఆసక్తి లేకుండా పనిచేస్తే పని బాగా జరుగుతుంది, నీకు చిత్తశుద్ధి కలుగుతుంది. మీరు చేసే పని మీకు మోక్ష సముపార్జనకు సహకరించాలి. అంతేగాని ఈపనులు చేయటం వలన అందరూ మిమ్మల్ని మెచ్చుకోవాలి అని మీరు పనిచేస్తే అహంభావన పెరుగుతుంది. మనం ఈశ్వరుడు చెప్పిన మాటకు బానిసగా ఉండాలి గాని అహంకారానికి బానిసగా ఉండకూడదు. ఈశ్వరునికి బానిసగా ఉంటే ఆయన అనుగ్రహానికి పాత్రులవుతాము, అప్పడు ఆయన స్వరూపం వ్యక్తమవుతుంది. దేవుని దగ్గర పుష్పాలు పెట్టటం, గుడిచుట్టూ తిరగటం, ముక్కులో గాలి చూసుకోవటం అదేసాధన అనుకోవద్దు. ఇతరులు ఎవరైనా నిన్ను ద్వేషిస్తూ ఉంటే వారిపట్ల నీవు ద్వేషరహితంగా ప్రవర్తిస్తూ ఉంటే అది కూడా గొప్ప సాధన. కోపకారణం ఉన్నప్పటికీ కోపం లేకుండా ఉండాలి, ద్వేషకారణం ఉన్నప్పటికి ద్వేషరహితంగా ఉండాలి. అప్పడు అమృతత్వం నీకు అనుభవంలోనికి వస్తుంది. హృదయం యొక్క లోతులు పెరిగి, నీలోపల శాంతి నీచేతికి అందుతూ ఉంటే బాహ్యాసంఘటనల పట్ల నీదృక్పదమే మారిపోతుంది. అంటే ఆసంఘటనల ప్రభావం నీమీద ఉండదు. ఎవరైనా మాట అంటే మేము పడం అని కొంతమంది అంటూ ఉంటారు. అది అజ్ఞానం అని వారికి తెలియటంలేదు. మాటలో ఏముంది ఏమీలేదు. అందుచేత సాధ్యమైనంతవరకు యాక్షన్ పెంచుకుంటూ, రియాక్షన్ తగ్గించుకొంటూ రావాలి. అది బాగుపడేవాడి లక్షణం. బట్టలు మార్చుకోవటం సన్యాసం కాదు, ఇల్లు విడిచిపెట్టటం సన్యాసం కాదు, చేతిలో ఉన్న పనిని విడిచిపెట్టటం సన్యాసంకాదు, దొంగ నేనులో నుండి విడుదల పొందటమే సన్యాసం. దానిని లోపల ఉంచుకొని నీవు బట్టలు మార్చుకున్నా ప్రయోజనం లేదు. ఏ నేను అయితే నిన్ను దేహంతో, లోకంతో, విషయములతో బంధిస్తోందో దానిలో నుండి విడుదల పొందటమే సన్యాసం. అహంభావనకు వెళ్ళే ఆహారాన్ని కట్ చేయాలి. అదేసాధన. నీవు అదనంగా శరీరం అంతా బాడి చేసుకోనక్కరలేదు. నీవు అహంకారాన్ని కేంద్రంగా పెట్టుకోవద్దు. ఈశ్వరుని కేంద్రంగా పెట్టుకొని పనిచేస్తే అహంకారం అనే గూటిలో నుండి బయటకు వస్తావు. అహంకారం నుండి బయటకు రావటానికి నీవుచేసే పనిసహకరించాలి. మూలతలంపును దాని మూలంలో స్థిరంగా ఉంచితే అది నశిస్తుంది. అప్పడు పనిచేస్తున్నా నీవు పనిలో ఆనందమును అనుభవిస్తూ ఉంటావు. నీవు పూజగదిలో వున్నా, ఏకాంతంగా ఉన్నా, పదిమందిలో ఉన్నా ఎక్కడ ఉన్నా నీకు ఆనందమే.

నీవుఎవరో నీకు తెలిసేవరకూ నీవు కానిదానిని నీవు అనుకొంటూనే ఉంటావు. ఈదేహమునేను, మనస్సునేను, గౌరవం నేను, అగౌరవం నేను అని ఇలా ఏదో ఒకటి అనుకొంటూ ఉంటావు. నీకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో దానిని దాని మూలంలోనికి వెళ్ళేవరకు ఉపసంహరించాలి. మూలతలంపు దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది. అప్పడు నీవు ఎవరో నీకు తెలుస్తుంది. మీరు స్వార్థం లేకుండా పనిచేస్తూ ఉంటే, స్వార్థం కేంద్రంగా పెట్టుకొని జీవించేవారు మిమ్మల్ని విమర్శించినా మీకు ఏమీ అనిపించదు. మీకు

స్వార్థం ఉండి, వారికి స్వార్థం ఉంటే మీరు అంటే వారుకంగారు పడతారు, వారు అంటే మీరు కంగారుపడతారు. నీకు ఎప్పుడైనా దుఃఖం వచ్చింది అనుకో. దుఃఖం ఏ నేనుకు వస్తోంది అని ప్రశ్నించుకో. అప్పుడు దుఃఖం ఆగిపోతుంది. నీకు ఎప్పుడైనా గర్వం వచ్చింది అనుకో ఈ గర్వం ఏ నేనుకు వస్తోంది అని ప్రశ్నించుకో. గర్వం ఆగిపోతుంది, ఆ నేను కూడా అణిగిపోతుంది. అంటే నీకు రెండు లాభాలు. దొంగ నేను దేహం లేకుండా ఉండలేదు. దేహం వస్తే లోకం వస్తుంది. అక్కడనుండి అన్నీ వచ్చేస్తాయి. మొత్తం సృష్టి అంతా దేహము నేను అనే ఒంటిస్థంబం మీద ఆధారపడి ఉంది. అందుచేత దానిని డౌట్‌చెయ్యి, దానిని షేక్ చెయ్యి. రామనామం చేయని నోరు, రామనామం వినని చెవులు, రాముని రూపం చూడలేని కళ్ళు అవి ఇంద్రియాలు కాదు, అవి రంధ్రాలు అన్నాడు తులసీదాసు. మీ ఇంద్రియాలను, మీ తెలివిని, భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను భగవదనుభవం పొందటం కోసం ఉపయోగించుకోండి. కొంతమందికి భగవంతుడి నామంచేయాలని ఉంటుంది. ప్రక్కవారు ఏమనుకొంటారో అనుకొంటారు. అది కూడా అహంకారమే. ప్రక్కవారు ఆక్షేపిస్తే నీకు వచ్చే నష్టం ఏమిటి? మనం తక్కువ మాట్లాడాలి. ఎక్కువగా మాట్లాడితే తగాదాలు వస్తాయి. ఎక్కువ ఆలోచన, విచారణ, భక్తి కలిగిఉండాలి. వారు అలా ఉన్నారు, వీరు ఇలా ఉన్నారు అనే గొడవవద్దు. నీవు ఎలా ఉన్నావో చూసుకొని నీలో ఉన్నచెడుగుణాలను తొలగించుకొని, పవిత్రత సంపాదించి, నిన్ను నీవు సంస్కరించుకోవటానికి ప్రయత్నించు. మనజీవితం అంతా కృత్రిమంగా ఉంది. కాని లోపల ఉన్న వస్తువు సహజంగా ఉంది, నిర్మలంగా ఉంది. అందువలననే అది మనకు తెలియటంలేదు. లోపల చెడుసంకల్పం పెట్టుకొని మంచి మాట మాట్లాడినా దానివలన ప్రయోజనం లేదు. మంచిసంకల్పంతో మంచి మాట్లాడుతూ ఉంటే నీకు ఆధ్యాత్మిక పురోగతి వస్తుంది. లోపల చెడుసంకల్పం పెట్టుకొని మాట్లాడుతూ ఉంటే రంపం పెట్టి కోసివేసినా నీకు జ్ఞానం రాదు. మనం భగవంతుడిని మోసం చేయలేము. మనస్సులో దారిద్ర్యం ఉండకూడదు. కొంతమందికి ఆర్థికస్తోమత ఉండదు. కాని మాటలో, చూపులో, మనస్సునిండా అంతాసంపదే. లోపల సంపద ఉన్న వారిని చూస్తే మనకు జ్ఞానం కలుగుతుంది. మానసిక దారిద్ర్యం ఉన్నవాడు ఎన్నిగుళ్లు కట్టించినా, యజ్ఞాలు చేసినవాడికి జ్ఞానం రాదు, పుణ్యం వస్తే రావచ్చు అది అనుభవిస్తే పోతుంది. కొంతమందికి ఎంతధనం ఉన్నా తృప్తి ఉండదు. ఎంతో కొంత తృప్తి ఉండాలి. తృప్తిలేక పోతే మీరు సాధన చేసినా తరించరు. దేహం విడిచి పెట్టేనాటికి గాంధీగారికి ఉన్న ఆస్తి భగవద్గీత, కళ్ళకుజోడు, కాళ్ళకు జోడు, కర్ర అవే ఆయన ఆస్తి మరి మహత్ముడు ఎలా అయ్యాడు అంటే లోపల ఉన్న స్వచ్ఛత అనే సంపద వలన ఆయన మహాత్ముడు అయ్యాడు. అదే నిజమైన సంపద.

05-05-2002

3A



**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 27-04-2002, కోడవల్లి)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను సద్వినియోగంచేసుకొంటే మరణానంతరం వెలుగుఉన్న లోకాలకు వెళతాము, భగవంతుడు ఇచ్చిన అవకాశములను దుర్వినియోగం చేస్తే మరణానంతరం చీకటి లోకాలకు వెళతాము. భగవంతుడు మనకు కొన్ని అవకాశములు ఇస్తాడు. చదువు, ధనం, అధికారం వీటిని సద్వినియోగం చేసుకోవాలి. నీవు నిష్కామకర్మను కొంతైనా ఆచరించు, స్వార్థంలేకుండా నీవు చేయగలిగినంత పనిచెయ్యి. ఇలా నీవు పనిచేస్తుంటే ఆపనే నిన్ను రక్షిస్తుంది, ఈజన్మలోనే కాదు రాబోయే జన్మలోకూడా నిన్నురక్షిస్తుంది అని భగవంతుడు చెపుతున్నాడు. గాధల జోలికి వెళ్ళకండి, లోపలకు వెళ్ళండి, లోపలకు వెళ్ళండి అంటారు భగవాన్. వస్తువు నీలోపల హృదయగుహలో ఉంది. బయట కనిపించే దేవతలు అందరూ దాని యొక్క నీడలుమాత్రమే. ఒక వస్తువు నీటిలో పడిపోతే నీ ప్రాణమును, ఇంద్రియాలను నిరోధించి లోపలకు మునిగి ఆవస్తువును ఎలాతెచ్చుకుంటున్నారో అలాగ నీ మనస్సును ఉపసంహరించి హృదయగుహలో మునగాలి. మనస్సును లోపలకు పంపటానికి సాధన అవసరం. చేపనీటి ప్రవాహమునకుఎలా ఎదురీదుతుందో అలాగ నీమనోప్రవాహమునకు ఎదురీది మనోమూలంలోనికి వెళ్ళాలి. మనోమూలంలోనికి వెళ్ళి అక్కడ స్థిరపడితే ఈశ్వరుడు తన స్వరూపాన్ని ఇస్తాడు. కర్త ఈశ్వరుడే ఆయన స్వతంత్రుడు. అందువలన మనం ఆయనను ఆశ్రయించాలి. ఆయన Birthless, Death-less. ఆయనను ఆరాధించటం వలన ఆస్థితిని మనకు అనుగ్రహిస్తాడు. నీకు దేహము, మనస్సు తెలుస్తున్నాయి కదా వీటిని లోపల ఉన్న భగవంతుడిని తెలుసుకోవటాని ఉపయోగించుకోవాలి.

మూలతలంపు మూలంలో నారాయణుడు ఉన్నాడు. మూలతలంపు మూలంలోనికి వెళ్ళటానికి వాక్కును, ప్రాణమును, మనస్సును నిరోధించాలి. నీకు లోచూపు కలగాలి. బాహ్యముఖం అవుతున్న మనస్సును లోపలకు పంపటానికి సాధన చేయాలి. మనస్సు బయటకు వెళ్ళినపుడు దానిని వదలివేయకూడదు. అది ఎన్నిసార్లు బయటకు వెళ్ళినా అన్నిసార్లు ప్రయత్నించి దానిని లోపలకు తీసుకొనిరావాలి. అలా ప్రాక్టీసు చెయ్యాలి. దాని పని అది మానినప్పుడు

నీపని నీవుకూడా మానవద్దు. నీకునిగ్రహం ఉంటే, బరువు ఉంటే హృదయంలోనికి వెళ్ళగలవు. కొంతమంది లోపల కపటం పెట్టుకొని ఎదుటి వారిని విమర్శిస్తూ ఉంటారు. నీలో కపటం పెట్టుకొని ఎదుటివారిని విమర్శించటం ఎందుకు? నీలో ఉన్న కపటం నీవు అంగీకరించటంలేదు. ఇంక నీకు ఆత్మజ్ఞానం ఏమిటి? నీవు ఏ మార్గంలో అయినా ప్రయాణించు. మూలతలంపు మూలంలోనికి వెళ్ళకుండా నీకు ఆత్మజ్ఞానం కలిగే సమస్యేలేదు. అందువలన మూలతలంపు మూలంలోనికి వెళ్ళాలి. కోరికలు పెరుగుతూ ఉంటే మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. పేచీలు ప్రారంభమవుతాయి. కోరికలు ఎక్కువఉన్న చోట పేచీలుఎక్కువ ఉంటాయి. నీవుస్వార్థం లేకుండా పనిచేయటం నేర్చుకో. స్వార్థం లేకుండా పనిచేస్తూ ఉంటే అదేయోగం. అప్పడు దేహగతమైన నేను దాని అంతట అదే నశిస్తుంది. నీవు పవిత్రుడవు అవ్వటానికి కర్మయోగం అవసరం. నీకు అనేక తలంపులు వస్తున్నాయి. ఈతలంపులు అన్నీ వేరుతో సహానశించే వరకు విచారణ చేయవలసిందే. ఆశ్రమంలో ఉండటం అంటే సోమరితనంగా ఉండటంకాదు. ఇంట్లో అయితే నీకోసం పనిచేసుకొంటావు ఆశ్రమంలో యితే పదిమంది బాగుకోసం పనిచేయాలి, నిన్ను నీవు తెలుసుకోవటానికి కృషిచేయాలి. ఆశ్రమంలో ఉన్నవాడు లోక ఉద్ధరణకు ఎంతోకొంత కృషి చేయాలి, అదేకాలంలో తనను తాను తెలుసుకోవటానికి విచారణ చేయాలి. అంతేగాని సోమరితనంగా ఉండటంకాదు.

మూలతలంపు ఎక్కడ ఉదయించి వస్తోందో అదే హృదయం. అది మన దేహంలో ఒక భాగంకాదు. ఈశ్వరుడు ఎక్కడో ఉన్నాడు అనుకోవద్దు. ఆయన మన హృదయంలోనే ఉన్నాడు. హృదయలో ఉండి ఈజీవులను నడిపిస్తున్నాడు. మూలతలంపును దానిమూలమైన హృదయంలోనికి పంపితే అక్కడ, దానికి సపోర్టు ఉండదు. అప్పడు దిక్కులేకుండా పోతుంది. అప్పడు లోపల ఉన్న సత్యం నీకుస్వరూపంగా వ్యక్తమవుతుంది. దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే ఆనందం. ధనం, పదవులు, ఆస్తులు, గౌరవాలు ఇస్తాము అంటే వద్దని చెప్పేవారు ఉంటారు. కాని సుఖం, శాంతి వద్దని చెప్పేవారు ఈసృష్టిలో ఎవరైనా ఉన్నారా? ఎవరూ ఉండరు. ఎందుచేతనంటే మనస్వరూపమే శాంతి. తనస్వరూపాన్ని వద్దని ఎలా చెపుతాడు. శాంతి బజారులో దొరకదు. అదిమూలతలంపు మూలంలో ఉంది. మూలతలంపు దాని మూలంలోనికి వెళ్ళి నశించినప్పడు శాంతి నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. నీవువెదికే వస్తువు నీలోపలేఉంది. లోపల ఉన్న బంగారాన్ని వదిలేసి రోడ్డు మీద ఉన్న పెంకు ముక్కలను ఏరుకొంటున్నాము.

05-05-2002



బంధంగురించి, మోక్షం గురించి ఆలోచించేది నీమనస్సే. లోపల ఉన్న వస్తువుకు బంధంలేదు, మోక్షంలేదు. అది నీవై వున్నావు. అది తానుగా నీకు వ్యక్తమయినప్పడు బంధంలేదు, మోక్షం లేదు. నేనుబంధంలో వున్నాను అని అనుకొంటున్నావు కాబట్టి మోక్షాన్ని కోరుకుంటున్నావు. మనబంధానికి కారణం అజ్ఞానం. మూలతలంపు నశించేవరకు అజ్ఞానం నిన్ను వెంటాడుతుంది. మూలతలంపు ఉన్నంతవరకు నీవు పాపరహితుడవు, దుఃఖరహితుడవు అవ్వలేవు. ఇప్పడు నీదేహం ఆరోగ్యంగానే ఉండవచ్చు. కాని దానికి ఎప్పడైనా రోగం రావచ్చు. రోగం రాదు అని చెప్పలేము. అలాగే మూలతలంపు ఉన్నంతకాలం నీవుపాపంచేయవచ్చు, దోషం చేయవచ్చు. మూలతలంపు ఉన్నంత కాలం నీవుపాపరహితంగా, దుఃఖరహితంగా , దోషరహితంగా ఉండలేవు. నీవు Sinless state, Sarrowless state పొందాలంటే మూలతలంపు మూలంలోనికి వెళ్ళవలసిందే. నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణించి మూలతలంపును తొలగించుకో. మూలతలంపును ఉంచుకొని దుఃఖరహితస్థితిని పొందటం సాధ్యంకాదు. మూలతలంపు ఉన్నంతకాలం అది నానాపెంట తెచ్చిపెడుతుంది. మంచిలోకాలకు వెళ్ళాలి అనిచెప్పేది మూలతలంపే. భోగాలు అనుభవించాలి అనేది మూలతలంపే. నువ్వు సాధన బాగా చేస్తున్నావు. మంచిదే, అయితే నీవు కాని దానిని నీవు అనుకోవటం మానివేసావా? లేదు. ఇంక సాధన ఎందుకు? నిన్ను ఎవరైనా అగౌరవపరిస్తే బాధపడుతున్నావా? లేదా? నీకు బాధ కలుగుతోంది. ఇంక నీవు చేసే సాధన ఎందుకు? మూలతలంపు కొంతమందితో స్నేహం చేస్తుంది. కొంతమందితో విరోధం పెట్టుకొంటుంది. ఇలా ఎన్నో ప్రయత్నాలు చేసి అది బయటకు వచ్చేస్తుంది.

రూపం ఉన్న దేవుడిని ఆరాధించమంటూరా? రూపంలేని దేవుడిని ఆరాధించమంటూరా? అని అడుగుతున్నాడు. అసలు ఆరాధించటం మొదలుపెట్టు. ఎలా చేసినా ఆయనకే చెందుతుంది. నీకు ఏది ఇష్టమైతే అదిచెయ్యి. ఆరాధించటం మానివేసి ఈతర్కాలవలన కాలం వృధా అవుతుంది. స్నేహితులు అని, విరోధులని ఇలా మనస్సు ఏదో ఒకటి పట్టుకొని ఉంటుంది. నామిత్రుల దగ్గర నుండి నన్ను కాపాడు అని ఒక పాండురంగ భక్తుడు అడుగుతాడు. శత్రువులు నాదగ్గరకురారు, నాకాలం వృధా చేయరు. మిత్రులు నాకాలం అంతా తినేస్తున్నారు. అందువలన నా మిత్రుల నుండి నన్నుకాపాడు అని అడిగాడు.

ఏ పనిచేసినా చిత్తశుద్ధితో చెయ్యి, హృదయపూర్వకంగాచెయ్యి. కొంతమంది మాటలో, పనిలో హృదయస్పందన ఉంటుంది. నీవు ఏపనిచేస్తున్నావు, అది పెద్దపనా, చిన్నపనా, అని

భగవంతుడు చూడడు. ఆపని నీవు ఏ ఉద్దేశంతో చేస్తున్నావు అనేది భగవంతుడు చూస్తాడు. రూపబుద్ధి, నామబుద్ధి మనలను బంధిస్తున్నాయి. ఇవే మనలను పాడుచేస్తున్నాయి. వీటిలో నుండి విడుదల పొందకుండా నీవు దు:ఖరహితస్థితిని పొందలేవు. నీవు ఒక్కక్షణంకూడా వృధాచేయవద్దు. వ్యర్థమైన తలంపులతో నీ టైము పాడుచేసుకొంటున్నావు. కొంతమంది స్నేహితులతో కాలక్షేపం కబుర్లు చెప్పకొంటూ, కొంతమంది విరోధులపై ఎలా పగసాధించాలి అని ఆలోచిస్తూ ఇలా కాలాన్ని పాడుచేసుకొంటున్నారు. మనం ఈ భూమి మీదకు ఎందుకు వచ్చామో మర్చిపోతున్నాము. మనకు మరణసమయం వచ్చినప్పడు భగవంతుడు ఒక్క క్షణం కూడా ఆపడు. ఎంతపెద్ద డాక్టరుకు అయినా మనరోగం అర్థంకాదు. అక్కడఉన్నవాడు కూడా ఈశ్వరుడే. ఆసమయంలో డాక్టరుకు అర్థంకానివ్వడు. చనిపోయిన తరువాత ఆరోగం గురించి తెలుస్తుంది. ఇద్దరు కూర్చొంటే వారిలో ఉన్నలోపాలు చూసుకోరు. ఇతరుల లోపాలగురించి మాట్లాడుకొంటారు. అసలుమీకు ఆహక్కు ఎక్కడిది అంటారు భగవాన్. ఇటువంటి వ్యర్థమైన మాటలతో కాలాన్ని పాడుచేసుకొంటున్నారు. స్వార్థంలేని కర్మ కొంచెం చేసినా దానిని వంపు పెట్టుకొని నిన్ను రక్షిస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. స్వార్థం ఉన్నవాడు తన స్వార్థంకోసం ఎలా పని చేస్తాడో ఆశ్రమంలో ఉన్నవాడు ఇతరుల క్షేమంకోసం అలాపనిచేయాలి. నీవు సహజంగా, నిర్మలంగాజీవించు. నాలో ఏదో గొప్పతనం ఉంది అని అనుకోవద్దు. అలా అనుకొంటూఉంటే అది జ్ఞానంకాదు, అది రోగం. దానికి మందు వాడు. చిత్తశుద్ధితో జీవిస్తూఉంటే సందేహం లేకుండా, నిశ్చయంగా నీకులోపల ఉన్న వస్తువు వ్యక్తమవుతుంది. నీ మనస్సునిండాకపటం పెట్టుకొని ఎదుటివాడిలో కపటంఉంది అని చెప్పటానికి ఆ హక్కు ఎవడు ఇచ్చాడు. ఆ మాట అనటానికి నీవు పనికిరావు.

మూలతలంపుకు పుట్టిల్లు హృదయం, అత్తవారి ఇల్లు శిరస్సు. దానిని అత్తవారి ఇంటివద్ద ఉంచకుండా సాధ్యమైనంతవరకూ పుట్టింటివద్ద ఉంచటానికి చూడండి. ఆత్మను తెలుసుకోవటం ఎలాగఅని అడుగుతున్నారు. దేహం, మనస్సుతెలుస్తున్నాయి. ఆత్మగురించి తెలియటంలేదు దానిని తెలుసుకోవటం ఎలాగ అంటున్నారు. నీ ఆత్మను నీవే కనుక్కో అంటున్నారు భగవాన్. అది బయటలేదు, నీ లోపలే ఉంది, నీవే కనుక్కోవాలి. ఆత్మను తెలుసుకోవాలి. ఆత్మను తెలుసుకోవాలి అంటున్నావు. తెలుసుకోవాలనేవాడిని తీసెయ్యి అప్పడు ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. ఆత్మ తెలియటంలేదు అంటున్నావు. తెలియటం లేదు అని చెప్పే నేనును తీసివెయ్యి. ఆత్మ గొడవవదిలి వెయ్యండి. నేను ఎందుకు పుట్టాను అంటున్నాడు? పుట్టింది ఎవరు అంటున్నారు భగవాన్. నీవు పుట్టలేదు. శరీరం పుట్టింది. అదినీవుకాదు. ఈ పుట్టింది ఎవరు అని విచారణచేస్తే పుట్టని వస్తువు గురించి నీకు తెలుస్తుంది. నిన్ను నీవు తెలుసుకోవటానికే ఈ లోకంలోనికి వచ్చావు. నీవు గుడులుచుట్టూ తిరిగినా, ఎంతసాధన చేసినా అహంభావరహితస్థితివచ్చేవరకు నీకు దు:ఖరహితస్థితి, పాపరహితస్థితిరాదు. అహంభావరహితస్థితి పొందటానికి మరణం వచ్చేవరకు మనం ఆగనక్కరలేదు. గాఢనిద్రలో మనం అహంభావరహిత స్థితిలోఉన్నాము. ప్రయత్నంచేసి జాగ్రదవస్థలో దానిని సంపాదించుకో. గాంధీగారు మహాత్ముడు అవ్వటానికి ఒకటేకారణం. ఒకమంచిపనికోసం దేహం ఇచ్చేయటానికి ఎప్పడూ సిద్ధంగా ఉండేవాడు. దేహానికి ఆయన ప్రాముఖ్యత ఇవ్వలేదు. అది అపూర్వం. మనపరిస్థితి ఎలా ఉంది అంటే ఎంతసేపు ఈ దేహానికి కావలసిన కంఫర్టు చూడటం, ఈ దేహాన్ని ముస్తాబు చేయటం సరిపోతోంది. హనుమంతుడు మహాబలవంతుడు. పాండిత్యం, శక్తి, సౌందర్యం అన్నీ ఉన్నప్పటికీ ఆయన అణిగిఉన్నాడు. అందులో ఏదీ మనకు లేదు కాని ఎగిరిఎగిరి పడుతున్నాము. అంటే మనకు తూకంలేదు. తూకంవచ్చినప్పడు మనకు లోచూపు కలుగుతుంది. అప్పడులోపలఉన్న వస్తువు మనకు వ్యక్తమవుతుంది.

## శ్రీ నాన్నగాయత్రి

**అరుణాచలాయ విద్మహే**
**రమణభక్తాయ ధీమహి**
**తన్నో నాన్నః ప్రచోదయాత్**

**దండు సత్యనారాయణరాజు**
రిటైర్డు హైస్కూల్ హెడ్‌మాష్టారు

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 2-5-02 నుండి 13-5-02 | | విశాఖపట్నం కాంపు |
| 07-5-2002 | మంగళవారం | విశాఖపట్నం సీతమ్మదార క్షత్రియ కళ్యాణమండపము |
| 19-5-2002 | ఆదివారం | జిన్నూరు శ్రీరమణ క్షేత్రంలో |
| 23-5-2002 | గురువారం | నార్నిమెరక (వయా) మట్లపాలెం |
| 27-5-2002 | సోమవారం | పాలకోడేరు, షిరిడి సాయిబాబాగుడి, హైస్కూల్ దగ్గర |

## శ్రీ షిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవము



ప॥గో॥జిల్లా గుడ్డుగుడెం భక్తుల ఆహ్వానం మేరకు సద్గురు శ్రీ నాన్నగారు ది. 20-4-2002 సాయంత్రం గుడ్డుగుడెం చేరుకున్నారు. భక్తుల తరఫున వెంకటరామరాజుగారు వారి ధర్మపత్ని భారతిగారు సద్గురు శ్రీనాన్నగారికి స్వాగతం పలికినారు. గుడ్డుగుడెం భక్తులు సద్గురు శ్రీనాన్నగారి దర్శనం చేసుకొన్నారు.

ది. 21-04-2002 ఆదివారం శ్రీరామనవమి పర్వదినాన ఉదయం గం॥ 10-54 ని॥లకు ప॥గో॥జిల్లా గోపాలపురంలో నూతనంగా నిర్మించిన శ్రీ షిరిడి సాయిబాబా వారి దేవాలయంలో సద్గురు శ్రీనాన్నగారు శ్రీ షిరిడి సాయిబాబావారి విగ్రహ ప్రతిష్ట గావించినారు.

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# సద్గురు శ్రీనాన్నగారు ఛారిటబుల్ ట్రస్టు




50-28-22, టి.పి.టి. కోలనీ, సీతమ్మధార,


విశాఖపట్నం - 530 013

రిజిష్టర్డు నెం. 10/2002 ☎ (O) 792346, 551265, (R) 552141



గౌరవ ట్రస్టీ :
**సద్గురుశ్రీనాన్నగారు**

మేనేజింగ్ ట్రస్టీ :
**శ్రీ పి.ఎస్.ఎన్.రాజు**


ది. 14-3-2002 న జిన్నూరు శ్రీరమణక్షేత్రంలో **సద్గురు శ్రీ నాన్నగారు ఛారిటబుల్ ట్రస్టు** లాంఛనప్రాయంగా సద్గురు శ్రీ నాన్నగారు ప్రారంభించినారు. జిన్నూరు గ్రామసర్పంచ్ మరియు వార్డుమెంబర్సు ఏర్పాటుచేసిన ఈసభలో కులవిభేదం లేకుండా 21 మంది నిరాధారులైన వృద్ధులకు నెలవారీ పెన్షన్ రు.75/-లు ఇచ్చినారు. ఈసభకు విచ్చేసిన పలువురు ప్రముఖులు సుమారు రు. 1,00,000/- లు విరాళాలు ప్రకటించినారు. ది. 30-3-02 న పాలకొల్లు సరస్వతి నగర్‌లో సరస్వతి శిశుమందిర్‌కు సద్గురు శ్రీ నాన్నగారు శంకుస్థాపన చేస్తూ ఈట్రస్టు ద్వారా విరాళం ప్రకటించినారు. ఇటువంటి ఎన్నో సేవాకార్యక్రమాలు చేసేఉద్దేశంతో ఈట్రస్టు ఏర్పాటు చేయబడినది.

**పి.ఎస్.ఎన్. రాజు,**
మేనేజింగ్ ట్రస్టీ